క్లుప్తంగా

మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేద్దాం



పోస్టర్లను విడుదల చేస్తున్న యోగా సాధకులు

కడప అర్బన్: జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధానికి తమ వంతు కృషి చేస్తామని యోగా సాధకులు, పలు శాఖల అధికారులు, సిబ్బంది ప్రతిన బూనారు. మాదక ద్రవ్యాల నివారణకు శిల్పారామంలో గోడ పత్రాలను అధికారులు ప్రదర్శించారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియచేస్తానని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథ రెడ్డి, ఆయుష్ నోడల్ అధికారి డా.ఎస్.మురళి బాబు, పర్యాటక అధికారి సురేష్ కుమార్, మెప్మా పి.డి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉర్దూ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందేలా చూడాలని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరిఫ్‌ఖాన్, రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్‌బాషా డిమాండ్ చేశారు. నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో విలేకరులతో గురువారం వారు మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు సకాలంలో అందక, సంబంధంలేని సబ్జెక్టులను ఎలా చదవాలో అర్థంగాక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి విద్యార్థికి వారికి సంబంధించిన సబ్జెక్టులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందేలా చూడాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ముస్లిం మైనారిటీ నాయకులు అమానుల్లా షేక్, లయన్ పటాన్ ఖాదర్ బాషా పేర్కొన్నారు. కడప గౌస్ నగర్‌లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలంతా బాగా చదువుకుని.. బాల కార్మిక వ్యవస్థ నుంచి విముక్తి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, శ్రీనివాసులురెడ్డి, ఖాజాపీర్, జుబేర్ అహ్మద్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం చేయమని అడిగితే బెదిరింపులు

కడప కార్పొరేషన్: న్యాయం చేయమని అడిగితే కడప తహసీల్దారు కార్యాలయం అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఎం.దేవ, ఆయన తల్లి ఎం.సాయమ్మ ఓ ప్రకటనలో ఆరోపించారు. టిడ్కో–2 లేఔట్‌లోని జగనన్న కాలనీలో తాము ఇల్లు నిర్మించుకుంటుంటే రెవెన్యూ అధికారులు నిర్మాణం నిలిపివేయించారన్నారు. ఇదేమని అడిగితే ప్రభుత్వం ఇచ్చినప్పుడే మాల, మాదిగలు ఇళ్ల స్థలాలకు అర్జీలు పెట్టుకోవాలని, మిగిలిన సమయాల్లో కాదని తెలిపారన్నారు.


బ్యాంకు సేవలు సులభతరం



సేవలను ప్రారంభిస్తున్న సూర్యనారాయణరెడ్డి

కడప అగ్రికల్చర్: బ్యాంకు ద్వారా ఐఎంపీఎస్ సేవలను ఖాతాదారులకు మరింత అందుబాటులోకి తెచ్చామని డీసీసీ బ్యాంకు చైర్మెన్ ఎం.సూర్యనారాయణరెడ్డి అన్నారు. కడప డీసీసీ బ్యాంకులో జరిగిన సమావేశంలో ఐఎంపీఎస్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారుడు లక్ష రూపాలయ వరకూ చెల్లించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఓ వెంకటసుబ్బయ్య, ఆప్కాబ్ డైరెక్టర్ రాంబాబు నాయక్, నాబార్డ్ డీడీఎం విజయ్‌విహారి, సీఈఓ రాజమణి, డీజీఎం ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సేవామూర్తులు

కడప అర్బన్: కాశీ విశ్వనాథ సేవా సమితి అధ్యక్షుడు రెడ్డి లక్ష్మణ్ కడప ప్రేమాలయ నిరాశ్రయుల నివాస వసతిగృహంలో వృద్ధులు, నిరాశ్రయులకు గురువారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, పుట్ట పురుషోత్తం, వెంకట సురేష్ బాబు, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

చంద్రన్నా...ఉచిత బస్సు ఎప్పుడన్నా!

ఎన్నికల సమయంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని కూటమి నాయకులు సూపర్ సిక్స్ పేరుతో హామీలను గుప్పించారు. పేదల సంక్షేమమే తమ ధ్యేయమని, గెలిపిస్తే ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తామని ప్రజలకు నమ్మబలికారు. తీరా అధికారంలోకి వచ్చాక ఓట్లేసిన ప్రజలను మరిచారు. సంక్షేమ పథకాల ఊసే ఎత్తకుండా... రేపు.. మాపు అంటూ ప్రకటనలతో పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.



- ఏడాదిగా మహిళల నిరీక్షణ
- హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న మహిళలు

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ కడప జిల్లాలో 13 లక్షల మందికి పైగా మహిళలు ఉన్నారు. వారిలో రోజుకు 60శాతం మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో మహిళలను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ టీడీపీ, జనసేన నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామిల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలకిచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఎప్పుడు అమలు చేస్తారో అని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న మహిళలకు నిరాశే మిగులుతోంది. బాధ్యతలు స్వీకరించి ఏడాదయినా హామీ అమలు చేయకపోవడంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఆగస్టు 15వ తేదీ నుంచి హామీ అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. మహిళలు మాత్రం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తక్షణమే హామీ అమలు చేశారు. కూటమి నేతలు మాత్రం మీన మేషాలు లెక్కిస్తున్నారు.

స్పష్టత ఏదీ?

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై ఇప్పటివరకూ స్పష్టత ఇవ్వకపోవడం దారుణం. గతేడాది ఆగస్టు 15వ తేదీన ప్రకటించారు. మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణమని సోషల్ మీడియా వేదికగా సమాచారం వెలుగులోకి వచ్చింది. దీనికితోడు ఏకంగా చంద్రబాబు సైతం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చాంగానీ వాటిని అమలు చేయాలంటేనే భయమేస్తోందని వ్యాఖ్యానించడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఎండీయూ వాహనాలను నిలిపి వేసి రేషన్ దుకాణాల వద్ద సరకులు తీసుకోవాలని ఓట్లు వేసిన ప్రజలకు ఝలక్ ఇచ్చారు. ఇదే కోవలో ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందా? అని మహిళలు అనుమానం పడటంలో ఎలాంటి తప్పు లేదు.

హామీలన్నీ అమలుచేయాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఎన్నికల ముందు ఊదరగొట్టి ఇప్పటి వరకూ అమలు చేయలేదు. ఎప్పుడు అమలు చేస్తారో తెలియడం లేదు. ఒకవైపు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో ఆయా ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తక్షణమే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాయి. ఇక్కడ ఎందుకు చేయలేకపోతున్నారో అర్థం కావడం లేదు.

– ఏసమ్మ, గృహిణి, కడప

మహిళలు మోసపోయారు



ఎన్నికలముందు హామీలు ఇచ్చేటపుడు వాటి ఆచరణకు సంబంధించిన ఆలోచనలు చేయాలి. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొన్న చంద్రబాబు హామిలు చూస్తుంటే భయమేస్తోందని వ్యాఖ్యానించడం దారుణం. టీడీపీకి ఓటు వేసిన మహిళలంతా మోసపోయారు. సూపర్‌సిక్స్ హామిలను త్వరితగతిన అమలు చేయాలి.

– టీపీ వెంకట సుబ్బమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు

సత్యదేవునికి భక్తిశ్రద్ధలతో పూజలు



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

కడప కల్చరల్: కడప గడ్డిబజారులోని లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వేదిక్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్యాణపురం వరదరాజన్, అర్చకులు విజయ్‌భట్టర్ బృందం ఆధ్వర్యంలో ముందుగా మహా సంకల్పం, విశ్వక్సేన ఆరాధన, లక్ష్మీ తులసీ అర్చన, సామూహిక విష్ణు సహస్రనామం, లక్ష్మి సత్యనారాయణస్వామి సుదర్శన హోమం జరిపారు. మధ్యాహ్నం 12.00 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లను కల్యాణ మూర్తులుగా తీర్చిదిద్ది కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులందరూ సంప్రదాయ వస్త్రాలతో హాజరుకావడం విశేషం. అనంతరం నగరోత్సవం నిర్వహించారు.

సౌర విద్యుత్‌తో ఎన్నో ఉపయోగాలు



సమావేశంలో మాట్లాడుతున్న హరిసేవ్యానాయక్

కడప కార్పొరేషన్: సౌర విద్యుత్‌తో ఎన్నో ఉపయోగాలున్నాయని విద్యుత్ శాఖ కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యానాయక్ అన్నారు. స్థానిక చింతకొమ్మదిన్నె పరిధిలోని మూలవంక 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ సూర్యపలకాలు అమర్చుకుంటే ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. మిగిలిన మొత్తానికి బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయని, కిలో వాట్‌కు రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78వేల రాయితీ ఉంటుందని, బీసీలకు రూ.20 వేలు అదనంగా ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వేణుగోపాల్‌రావు, శివప్రసాద్‌రెడ్డి, జూనియర్ ఇంజినీర్లు రామక్రిష్ణ, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఫాదర్ కంబ్లిష్



నివాళులర్పిస్తున్న శాంతి సేవా సొసైటీ ప్రతినిధులు

కడప కల్చరల్: జిల్లాలో క్రైస్తవ సంఘాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేసిన వ్యక్తి మేధావి ఫాదర్ కంబ్లిష్ అని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ అన్నారు. కంబ్లిష్ వర్ధంతి సందర్భంగా మరియాపురంలోని ఆయన విగ్రహానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాదర్ కంబ్లిష్ మరియాపురం స్థాపించారని, పేదరిక నిర్మూలన, స్వయం ఉపాధి కల్పన, సొంతింటి కల కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వారధి జోసప్, మునెయ్య, జ్యోతి జార్జి బాలస్వామిపాల్గొన్నారు.

మానవాళికి చెట్లే ఆధారం

మానవాళికి చెట్లే ఆధారమ శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ తెలిపారు. సరోజినీ నగర్‌లోని మడగలం రాజన్న సంస్మరణ దినోత్సవానికి హాజరైన ఆయన వారి కుటుంబ సభ్యులకు మొక్క బహుమతిగా అందించారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ ఈదురుబాషా

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే చిన్నారులు తమ ఉజ్వల భవిషత్తుకు బాటలు వేసుకోవాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాషా అన్నారు. నగరంలోని నారాయణ జూనియర్ కాలేజీ విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్–100, రహదారి భద్రత, సోషల్ మీడియా - సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర స్మారక చిహ్నంగా చింతకుంట చిత్రాలు

కడప కల్చరల్ : చింతకుంట చిత్రాలకు ఆదిమానవుని చిత్రాలకు సంబంధించి గొప్ప పేరుందని, కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో స్మారక చిహ్నంగా చోటుచేసుకోనుందని కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరం రాశారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఏప్రిల్ 30న ప్రధానికి లేఖ రాశారు. వైఎస్సార్ జిల్లాలోని చింతకుంట చిత్రాలతోపాటు శ్రీపొట్టి శ్రీరాములు జిల్లాలోని నాయుడుపేట మండలంలోగల గొట్టి ప్రోలును గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్పందించిన ప్రధానమంత్రి కార్యాలయం సిఫారసు చేస్తూ కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు పంపారని, క్షుణ్ణంగా పరిశీలించిన సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కేంద్రపురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ కు ఆదేశాలు జారీ చేశారన్నారు.ఈ విషయం పైన కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ లేఖను డాక్టర్ జాస్తి వీరాంజనేయులుకు పంపారు. కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ బాడీ జర్ కడప జిల్లాలోని చింతకుంట ప్రాచీన రాతి చిత్రాలకు, శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లాలోని గొట్టి ప్రోలును జాతీయ స్మారకాలుగా (నేషనల్ మాన్యుమెంట్) గుర్తించే దానికి ప్రాసెస్ లో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలోని చింతకుంట లోని ఆదిమానవుల శిలా రేఖాచిత్రాలకు దేశవ్యాప్తంగా ఎనలేని ఖ్యాతి కలదు అన్నారు కేంద్ర ప్రభుత్వం స్మారక చిహ్నంగా గుర్తించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇప్పటికే చింతకుంట చిత్రాలకు సంబంధించి దేశమంతటా విస్తృతంగా ప్రచారం జరిగిందని, వీటిని జాతీయ సంపదలుగా గుర్తించేందుకు ఇంటాక్ చేస్తున్న కృషికి మంచి చేయూతలభించినట్లయిందని తెలిపారు.

ఈకేవైసీ చేసుకోవాలి

కమలాపురం : అన్నదాత సుఖీభవ పథకం వర్తింపు కోసం రైతులు తప్పని సరిగా ఈకేవైసీ చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని పెద్దచెప్పలి రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ పోర్టల్ నందు జరుగుతున్న ఈకేవైసీని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతు సమీపంలోని ఆర్ఎస్‌కేలకు వెళ్లి అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ఈకేవైసీని తప్పని సరిగా చేసుకోవాలన్నారు. చిన్న, సన్న కారు రైతులు ఆధార్ కార్డు లేదా ఖాతా నెంబర్ ద్వారా ఆర్ఎస్‌కేలకు వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీని కూడా తప్పని సరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం



మాట్లాడుతున్న జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

కడప అర్బన్: బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యాన కడప న్యాయ సేవా సదన్‌లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 14–18 సంవత్సరాల మధ్య వయస్సున్న పిల్లలను పనిలో పెట్టుకుంటే జైలు శిక్ష, జరిమానా ఉంటాయన్నారు. అనంతరం బాలల చట్టాలు ఉపయోగాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీల అమలులో సర్కార్ విఫలం



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలన ప్రారంభమై ఏడాది గడించిందని, ఈ ఏడాది కాలంలో ఏ మాత్రం ప్రభుత్వ పాలన సంతృప్తికరంగా లేదని, సూపర్ సిక్స్ హామీల అమలులో ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ విమర్శించారు. గురువారం కడపలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఏడాది పాలనపై సీపీఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. ప్రజల్లో నిరుత్సాహం, ఆందోళన, అసంతృప్తి పెరిగిపోయాయన్నారు. ఎన్నికల ముందు 178 వాగ్దానాలు ఇచ్చి ఏడాదిలో 16 వాగ్దానాలను అమలు చేశారన్నారు. కార్పొరేట్లకు భూ పందేరం చేయడంలో ఉన్న శ్రద్ధ పేదలకు ఇళ్లు ఇవ్వడంలో లేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ సూచనల మేరకు ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై వారానికి నాలుగు అత్యాచారాలు జరుగుతున్నాయని చెప్పారు. కేంద్రంలో మోదీ పాలనలో బాదుడు ఎక్కువ, సంక్షేమం తక్కువని అన్నారు. ఏడాది కాలంలో గాడితప్పిన పాలనను సరిచేసుకుని నాలుగేళ్ల పాలన సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్మోహన్, మనోహర్, దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కుమార్ స్వామి రెడ్డి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య జ్ఞానపీఠంగా సినారె



డాక్టర్ సి.నారాయణరెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సేవా సమితి ప్రతినిధులు

కడప కల్చరల్: తెలుగు సాహిత్యానికి జ్ఞానపీఠంగా మరువలేని అంశాలను డాక్టర్ సి.నారాయణరెడ్డి సమకూర్చారని రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. సి.నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహితీ వేత్తగా, పరిశోధకుడిగా, సినీ గీతాల రచయితగా తెలుగు సాహిత్య పీఠానికి వెలుగులద్దిన ఘనత డాక్టర్ సి.నారాయణరెడ్డికే దక్కుతుందన్నారు. మనిషిలోని మమతానురాగాలను, బాధలను, కన్నీళ్లను తన రచనల్లో మనోజ్ఞంగా తీర్చిదిద్దిన అక్షర శిల్పి అని కొనియాడారు. సమితి కోశాధికారి గుడ్ల ఆదినారాయణ రెడ్డి ప్రసంగిస్తూ నారాయణరెడ్డి సాహిత్య కృషికి జ్ఞానపీఠ అవార్డు రావడం చాలా అభినందనీయమన్నారు. ఆయన ఎన్నో డాక్టరేట్లు, అత్యున్నత పదవులు పొందారని తెలిపారు. రెడ్డి సేవా సమితి కార్యవర్గ సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సినారె రాసిన విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠం పురస్కారం లభించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, పద్మప్రియ చంద్రారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, నరసింహారెడ్డి, చెంచిరెడ్డి, రాజు, జీవకళ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ లెప్రసీ అలవెన్సు చెల్లించాలి



రిలే నిరాహార దీక్షల్లో ఆశా వర్కర్లు, తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: పెండింగ్‌లో ఉన్న లెప్రసీ అలవెన్సు తక్షణమే చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి డిమాండ్ చేశారు. కడప కలెక్టరేట్ ఎదుట గురువారం ఆశా వర్కర్లు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు 62 ఏళ్లకు రిటైర్‌మెంట్ వయస్సు, గ్రాట్యూటీ పెంచాలని కోరారు. మెటర్నటీ సెలవులకు సంబంధించిన జీఓలు జారీ చేయకపోవడం తగదన్నారు. రిటైర్‌మెంట్ ఇస్తే జీఓ ఇచ్చిన తర్వాత విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఆశా కార్యకర్తలకు ఇవ్వాల్సిన లెప్రసీ అలవెన్సు పెండింగ్‌లో ఉంచడం అన్యాయమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అలవెన్సు విడుదలైనప్పటికీ ఆశా వర్కర్లకు ఇవ్వకుండా ప్రభుత్వానికి తిప్పిపంపడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, కల్పన, నరసమ్మ, శాంతమ్మ, అమ్ములు, మద్దిలేటి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం సొంతం



యోగాసనాలు చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

కడప కల్చరల్: యోగా దైనందిన జీవితంలో ఒక భాగంగా మారితే.. సంపూర్ణ ఆరోగ్యం సొంతం అవుతుందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం కడప శిల్పారామంలో నగర ప్రజలు, అధికారులకు యోగా మాస్టర్ ట్రైనర్లు యోగా శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథి విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా కార్యక్రమం నిర్వహించారన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడప అదనపు మునిసిపల్ కమిషనర్ రాకేష్ చంద్, జిల్లా పర్యాటక అధికారి సురేష్‌కుమార్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, ఆయుష్, అధికారులు ఎన్జీవో ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు



మాట్లాడుతున్న వలరాజు

కడప వైఎస్ఆర్ సర్కిల్: వైఎస్ఆర్ అండ్ ఆర్కిటెక్ యూనివర్సిటీ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు అన్నారు. నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆర్కిటెక్ యూనివర్సిటీలో 13 డిపార్ట్‌మెంట్లలో 500 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 2020–21, 2021–22 విద్యా సంవత్సరానికి సీఓఏ కౌన్సిల్ అఫ్ ఆర్కిటెక్ పర్మిషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. పది రోజుల్లో విద్యా సంవత్సరం పూర్తవుతున్నా.. ఇంకా పర్మిషన్ లేకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు ఆందోళన చెందుతుంటే.. ఉన్నతాధికారులు కాలయాపన చేయడం తగదన్నారు. యూనివర్సిటీ బిల్డింగ్‌లకు అద్దె కడుతున్నా.. వైస్ ఛాన్సలర్, కాంట్రాక్టర్ మధ్య విభేదాల కారణంగా హాస్టల్ వేకెట్ చేయమనడం తగదన్నారు. రెన్యువల్ లేని కారణంగా అధ్యాపకులు బోధించడంలేదని, విద్యార్థులు ప్రాక్టికల్ వర్క్, పరీక్షలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలోఅరుణ్ కుమార్, సాయి కృష్ణ, రామాంజనేయులు తరుణ్ వరప్రసాద్ హేమంత్, సింధు, సుష్మ, శరణ్య పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలి




కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట గురువారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ ప్రైవేటీకరణ ఆపాలంటూ మూడేళ్లుగా కార్మిక సంఘాలు ఆందోళనను కొనసాగిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. సుమారు 3200 మంది కాంట్రాక్టు కార్మికులను అకారణంగా తొలగించారని విమర్శించారు. ఎస్ఆర్ పాలసీ, కార్మికులకు రావాల్సిన ఇతర బెనిఫిట్స్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ అడ్డుకుంటామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన టీడీపీ, జనసేన నాయకులు ఇప్పుడెందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. కడపలో ఉక్కు పరిశ్రమను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, అధ్యక్షులు సుబ్బరాయుడు, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేను చెప్పినోళ్లను బదిలీ చేయండి!

- నేను డాక్టర్‌ను..మా నాన్న ప్రజా ప్రతినిధి
- వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో ఓ వ్యక్తి హంగామా



రిమ్స్‌లో హల్‌చల్ చేసిన వ్యక్తి..

కడప రూరల్: నేను కడప రిమ్స్‌లో ఆర్థో డాక్టర్‌ను.. మా నాన్న ప్రజా ప్రతినిధి. వీళ్లు నా మనుషులు. చెప్పిన చోటికి బదిలీ చేయండి.. అంటూ ఓ వ్యక్తి హంగామా చేస్తున్నాడు. వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీంతో కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం సందడిగా మారింది. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి గత మూడు రోజుల నుంచి కార్యాలయంలోకి వచ్చి తాను చెప్పినోళ్లకు చెప్పిన చోటికి బదిలీ చేయాలని సిఫారసు చేస్తున్నారు. ఆ వ్యక్తి తాను కడప రిమ్స్‌లో ఆర్థో డాక్టర్‌గా పనిచేస్తున్నాను.. అనస్తీషియా చేయడానికి సింగపూర్ వెళుతున్నాను. మా నాన్న పెద్ద ప్రజా ప్రతినిధి అంటూ హల్‌చల్ చేస్తున్నాడు. తన వెంట వచ్చిన ఉద్యోగులను చూపించి, వీరికి ఫలానా ప్రాంతానికి బదిలీ చేయాలని ఆదేశిస్తాడు. ఇతను గతంలో అప్పుడప్పుడు ఈ కార్యాలయానికి వచ్చేవాడు. ఇప్పుడు బదిలీల సమయం కావడంతో తరచూ వస్తున్నాడు. తన వెంట ఏదో ఒక జిల్లాకు చెందిన ఉద్యోగులను వెంటబెట్టుకొని వస్తాడు. 'చెప్పిన పని చేయండి' అంటూ బెదిరిస్తాడు. అతగాడి దెబ్బకు అక్కడ పని చేసే ఉద్యోగులు విసిగిపోతున్నారు. కాగా జోన్–4 పరిధిలో పనిచేసే కొంత మంది ఉద్యోగులు తమకు అనుకూలమైన చోటికి బదిలీ కావాలని ఆశ పడుతున్నారు. అందుకు దారులు వెతుకుతున్నారు. అలాంటి వారిని ఈ వ్యక్తి బుట్టలో వేసుకుంటున్నాడు. తద్వారా ఉద్యోగుల నుంచి లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీ చేయాలంటూ బెదిరిస్తున్న ఈ వ్యక్తి కదలికలపై దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకుంటే మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

ప్రలోభాలకు లొంగవద్దు...

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బదిలీలను చేపడతాం. ఎవరైనా తాము బదిలీలు చేయిస్తామని చెబితే నమ్మవద్దు. ఉద్యోగులు ప్రలోభాలకు లొంగవద్దు. నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తాం.

– డాక్టర్ రామగిడ్డయ్య, రీజినల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం